క్లుప్తంగా

నర్సరీల్లో మొక్కలు సంరక్షించాలి



మొక్కలు పరిశీలిస్తున్న ట్రైయినీ కలెక్టర్

భీమిని: మండల కేంద్రంలోని నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలని ట్రెయినీ కలెక్టర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ గౌతమి అన్నారు. నర్సరీ, డంపింగ్‌యార్డులను బుధవారం పరిశీలించి మాట్లాడారు. ఎండాకాలంలో ప్రతి మొక్కనూ బతికించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఎంపీఓ సబ్దర్‌అలీ, ఏపీఓ భాస్కర్‌రావు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: జనగామలో ఈ నెల 29న నిర్వహించే తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు తంగళ్లపల్లి వెంకటేష్ కోరారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిరాల రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు ముస్కు చందర్, ముస్సూరీ మండల అధ్యక్షుడు కొత్తకొండ రామస్వామి, యూత్ ప్రెసిడెంట్ కొండపర్తి గణేష్, కొండపర్తి లక్ష్మణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల ఎస్సైగా శ్యాంపటేల్



నెన్నెల: మండల ఎస్సైగా పనిచేసిన రాజశేఖర్ తాండూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా నెన్నెల ఎస్సైగా గోదావరిఖని టూటౌన్‌లో ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తించిన శ్యాం పటేల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమై శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, శాంతిభద్రతలను కాపాడుతానని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

టీబీఎస్ఎస్ గౌరవ అధ్యక్షులుగా రాంభావ్

చెన్నూర్: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఆకుదారి రాంభావ్‌ను తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులుగా నియమిస్తూ బుధవారం నియామకపత్రాన్ని అందజేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది మోతె రాజలింగు తెలిపారు. కార్యక్రమంలో టీబీఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్పుల వెంకటస్వామి పాల్గొన్నారు.

ఎకరాకు రూ.25వేలు పరిహారం అందించాలి

దండేపల్లి: మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో, నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.25వేల పరిహారం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ డిమాండ్ చేశారు. మండలంలోని మాకులపేటలో వరిపొలాలన్ని బుధవారం పరిశీలించారు. పంటనష్టాన్ని అంచనా వేసి, నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలన్నారు.

అనారోగ్యంతో రిమ్స్ కరస్పాండెంట్ మృతి

మంచిర్యాలఅర్బన్: స్థానిక రిమ్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.కృష్ణ కుమార్ బుధవారం రాత్రి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంచిర్యాల పట్టణంలో 30ఏళ్లుగా కళాశాలలు నిర్వహిస్తూ, ఎంతో మంది యువత భవిష్యత్‌కు కృషి చేశారని, ఎంతో మందిని ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దారని ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలు కాళేశ్వరంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ముగిసిన సీఎస్ఐ జాతర



జాతరలో భక్తుల సందడి

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మిషన్ కంపౌండ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న సీఎస్ఐ చర్చి యేసుక్రీస్తు పునరుద్ధరణ జాతర బుధవారం ముగిసింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో దుకాణ సముదాయం భక్తులతో కిటకిటలాడింది. చర్చి ఫాదర్ కరుణకర్, క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులకు సందేశం అందించారు. పోలీసులు చర్చి ప్రాంగణంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకొని బందోబస్తు నిర్వహించారు.

పంట అమ్మకానికి పడిగాపులు..!



గాలివానలకు నేను వేసిన నాలుగెకరాల్లో రెండు ఎకరాల పంట నేలవాలింది. పంట కోయగా సగం వడ్లు కిందనే పోయినయ్. మిగిలిన వడ్లు కొనుగోలు కేంద్రం వద్ద పోస్తే కొనుగోలు చేయక, వానకు తడుస్తున్నయ్. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, నష్టపోయిన పంటకు పరిహారం అందించాలని కవ్వాల్‌కు చెందిన రైతు రేంద్ల గంగమల్లు అధికారులను వేడుకుంటున్నాడు.



- మండలంలో ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- అకాల వర్షాలతో అన్నదాతల్లో ఆందోళన
- వడ్లు కాపాడుకునేందుకు రాత్రిపగలు ధాన్యం వద్దే నిరీక్షణ
- కొనుగోళ్లపై స్పష్టతనివ్వని అధికారులు

జన్నారం: మండలంలో ఈ రబీ సీజన్‌లో 3500 ఎకరాల్లో కడెం ప్రాజెక్టు కింద, మరో 1500ఎకరాల్లో బావుల కింద వరి పంటలు వేసుకున్నారు. ఇప్పటికే కొందరు రైతులు వరిపంట కోసి, ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టుకోగా, కొన్ని కోత దశకు వచ్చాయి. ఈ సమయంలో నాలుగు రోజులుగా కురుస్తున్న గాలివానకు కోయని వరిపైరు నేలవాలి వడ్లు రాలిపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో నేలవాలిన వరి పైరు కోయలేని పరిస్థితిలో ఉందని పేర్కొంటున్నారు.

వందల ఎకరాల్లో పంటనష్టం..

ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వందల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. వెంకటపూర్ గ్రామంలో సుమారుగా 25ఎకరాల్లో, దేవునిగూడలో 25ఎకరాల్లో, కవ్వాల్, కామన్‌పల్లి, చింతగూడ, ఇందన్‌పల్లి, కలమడుగు, తదితర గ్రామాల్లో 150ఎకరాల్లో పంట నేలవాలి నష్టం జరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. సీఎం ఇటీవల ఆదేశాలు ఇవ్వడంతో వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ పంట నష్టంపై అంచనా వేస్తున్నారు.

ప్రారంభించని కొనుగోలు కేంద్రాలు..

వరికోత పూర్తయిన రైతులు ధాన్యాన్ని నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చారు. పంటను కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టగా వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతోంది. పొనకల్ వ్యవసాయ మార్కెట్‌లో, కలమడుగు, కవ్వాల్, మొర్రిగూడ గ్రామాల కేంద్రాల వద్ద రైతులు ఆరబోసుకున్న వరిధాన్యం వర్షాలకు తడిసిపోగా, ఆరబెట్టే పనిలో ఉన్నారు. గత సంవత్సరం ఐకేపీ, వ్యవసాయ సహకార సంఘం, డీఆర్‌డీవో ఆధ్వర్యంలో మండలంలో కొనుగోళ్లు జరపగా, ప్రస్తుతం ధాన్యం కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో రైతున్న ధాన్యం కుప్పల వద్దే పడిగాపులు కాస్తూ, కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూస్తున్నారు. అధికారులు ఈ విషయంలో స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

వారం నుంచి ఇక్కడే ఉంటున్నా



ప్రస్తుతం ఐదెకరాల్లో వరి వేశా. పంటను కోసి ధాన్యాన్ని పొనకల్ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాను. ధాన్యం పోసి వారం రోజులైతంది. ఇటు వైపు ఎవరూ రావడం లేదు. కనీసం కొంటారా.. కొనరా అనేది చెప్పడం లేదు. కేంద్రాలు ప్రారంభించి వడ్లు కొనుగోలు చేయాలి.

- మల్యాల శ్రీనివాస్, రైతు, బాదంపల్లి

త్వరలో ప్రారంభిస్తాం

ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు సమావేశం పెట్టారు. 14కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. అయితే బర్దాన్, ధాన్యం బస్తాల తరలింపు విషయంలో ఆలస్యం కాకుండా చూసేందుకు తగిన ప్రణాళిక తయారు చేస్తున్నాం. త్వరలో ప్రారంభిస్తాం.

- శీల రమేశ్, పీఏసీఎస్ చైర్మన్, పొనకల్

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



బెల్లంపల్లి: స్థానిక కార్మికవాడల్లో అసంపూర్తిగా ఉన్న రోడ్ల దుస్థితిపై అధికారులు దృష్టి సారించారు. బెల్లంపల్లిలోని రాంమందిర్ ఏరియా, స్టేషన్‌రోడ్ కాలనీ, ఏఎంసీ ఏరియా తదితర కార్మిక ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న రోడ్ల దుస్థితి గురించి ఈ నెల 24న 'సాక్షి' దినపత్రికలో 'కంకర పరిచి కాలయాపన' అనే శీర్షికతో వార్తా కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో వెంటనే స్పందించిన సింగరేణి ఏరియా అధికారులు బీటీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. రాంమందిర్ ఏరియాలో బుధవారం నుంచి బీటీరోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. గుంతలు పడి కంకర తేలి అధ్వానంగా ఉన్న రోడ్ల స్థానంలో, కొత్తగా బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో ఆయా ప్రాంతాల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. రోడ్డు పనులు నిలిచిపోయిన వైనాన్ని వెలుగులోకి తెచ్చి సింగరేణి అధికారులు స్పందించేలా చేసిన 'సాక్షి' దినపత్రికను అభినందించారు.

'తీరనున్న కరెంట్ కష్టం'

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: పట్టణంలోని సింగరేణి హైస్కూల్ గోడను ఆనుకుని నిర్మించుకున్న వ్యాపారుల విద్యుత్ సమస్య తీరనుంది. బుధవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన 'చిరు వ్యాపారులకు కరెంట్ కష్టం' అనే కథనానికి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఎస్ఈ శేషారావు, ఏడీఈ రాజశేఖర్, ఏఈ మల్లేషం చిరు వ్యాపారుల వద్దకు వచ్చారు. ఎమ్మెల్యే పీఏ శ్రీకాంత్, మందమర్రి మార్కెట్ వ్యాపార కమిటీ అధ్యక్షుడు తమ్మిశెట్టి విజయ్‌కుమార్ అధికారులకు సమస్యను విన్నవించారు. చిరు వ్యాపారులు మీటర్ కోసం దరఖాస్తు చేసుకుంటే, సింగరేణి అధికారులు స్ట్రీట్‌లైట్స్ పోల్స్ అప్పగిస్తే, ప్రభుత్వ కరెంట్ లైన్ ఏర్పాటు చేస్తామని, లేకుంటే కేబుల్ ద్వారా కరెంట్ కనెక్షన్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. కథనంతో అధికారులను కదిలించిన 'సాక్షి'కి చిరు వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడుతున్న మార్కెట్ వ్యాపార కమిటీ అధ్యక్షుడు విజయ్

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

మంచిర్యాలఅర్బన్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో సీసీసీ టౌన్‌షిప్ హనుమాన్ టెంపుల్ వద్ద ఈ నెల 28న ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగుల బస్‌పాస్‌ల పంపిణీ జరుగుతుందని డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. అంగవైకల్యం 40శాతం కన్నా ఎక్కువగా, మూగా, చెవుడు, కంటి వారికి 100శాతం ఉండాలన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు బస్‌పాస్‌ల పంపిణీ జరగనున్నట్లు, ఈ అవకాశాన్ని నస్పూర్ పరిసర ప్రాంత దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉద్యోగాలు సాధించాలి



నృత్యం చేస్తున్న బాలికలు

బెల్లంపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉద్యోగాలు సాధించాలని గుడిపేట 13వ బెటాలియన్ డీఎస్పీ రఘునాథ్ చౌహాన్ అన్నారు. బెల్లంపల్లిలోని భవిత డిగ్రీ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ డే నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రక్షణరంగంలో అనేక ఉద్యోగాలు ఉన్నా, విద్యార్థులు అటువైపు సరిగా దృష్టిసారించడం లేదన్నారు. ఉన్నతమైన చదువులు చదివి ఉన్నత ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేయాలన్నారు. దురలవాట్లకు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు. అనంతరం ఆటల పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ హీరాలాల్ ఉపాధ్యాయ, ప్రిన్సిపాల్ డి.కన్నారావు, సీహెచ్.భావనరుషి, వ్యాపార వేత్త అజయ్‌కుమార్‌లోయ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతిలేని ఇళ్లు పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

తాండూర్: మండలంలోని మాదారం త్రీ ఇంక్‌లైన్, మాదారం గ్రామపంచాయతీల్లో అనుమతి లేకుండా నిర్మించిన ఇళ్లను బుధవారం బెల్లంపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీవో) ఫణీంధర్‌రావు ఆకస్మికంగా సందర్శించారు. గ్రామపంచాయతీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా చేపట్టిన ఇళ్లను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాలంటే, తప్పక గ్రామపంచాయతీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఎల్‌పీవో సూచించారు. డీఎల్‌పీవో వెంట మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ, మాదారం సర్పంచ్ సాగరిక, పంచాయతీ కార్యదర్శులు సాదుల్లా, సౌందర్య, పంచాయతీ వార్డు సభ్యులు ఉన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు

నెన్నెల: సత్యసాయి నెన్నెల సేవా సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు సమీపంలో ఉన్న సత్యసాయి సేవా కేంద్రంలో విద్యార్థులకు ఈ నెల 27నుంచి భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ సేవా సమితి అధ్యక్షుడు సేని వెంకన్న తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు 9రోజుల పాటు ఉదయం 8గంటల నుంచి 10.45గంటల వరకు తరగతులు కొనసాగుతాయన్నారు. యోగా, లక్ష్యం, నాయకత్వ లక్షణాలు, తల్లిదండ్రుల విశిష్టత, సమయపాలన ఆవశ్యకత, భారత దేశ విశిష్టత, క్రమశిక్షణ, దేశ, దైవ భక్తి, సమాజం, ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి నైపుణ్యాలు అవసరం అనే అంశాలపై శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం'



జరిమానా విధిస్తున్న కమిషనర్

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపారస్తులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ అన్నారు. పట్టణంలోని పలు బేకరీలు, హోటల్స్, వ్యాపార సంస్థలను బుధవారం కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపార కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. అపరిశుభ్రంగా ఉన్న ఆహార పదార్థాలను విక్రయించరాదని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న శ్రీ బాలాజీ రవీందర్ స్వీట్‌హౌజ్ యజమానికి రూ.3000, న్యూకాటన్ బజార్ రూ.3500, సరోవర్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు రూ.1000, వీబీ బెంగుళూర్ అయ్యంగారి బేకరీ యజమానికి రూ.3000 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



చెన్నూర్‌లో సమ్మెలో భాగంగా భిక్షాటన చేస్తూ..



జన్నారం: కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

మందమర్రిరూరల్/బెల్లంపల్లిరూరల్/జన్నారం/భీమారం/కోటపల్లి/చెన్నూర్/కాసిపేట/భీమిని/మంచిర్యాలరూరల్(హాజీపూర్): వీఓఏల సమ్మె జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో కొనసాగుతోంది. తమ డిమాండ్లను పరిష్కరించాలని వీఏఓలు బుధవారం వినూత్నంగా నిరసనలు తెలిపారు. పలు పార్టీల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వీఓఏల సమస్యలు పరిష్కరించాలని, సమస్యలు పరిష్కరించేంత వరకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. జన్నారంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలపగా, చెన్నూర్‌లో ప్రధాన వీధుల్లో తిరుగుతూ భిక్షటన చేశారు. పలుచోట్ల ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట దీక్ష చేపట్టారు.

తహసీల్దార్, ఎస్సైలకు జేపీఎస్‌ల విన్నపం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నాలుగేళ్ల ప్రొహిబేషన్ కాలం పూర్తి చేసిన తమను, ఈ నెల 28వ తేదీలోగా రెగ్యూలర్ చేయని పక్షంలో సమ్మె తప్పదని స్పష్టం చేస్తూ బుధవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్) హాజీపూర్ తహసీల్దార్ రాజలింగు, ఎస్సై నరేశ్‌కుమార్‌కు సమ్మెకు సహకరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు.

మిత అయ్యల్వార్ కళాకారుల ప్రదర్శన

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో ఈ నెల 28న శుక్రవారం మిత అయ్యల్వార్ సంక్షేమ సంఘం కళాకారుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా మిత అయ్యల్వార్ కళాకారుల సంఘం అధ్యక్షుడు నాగవెల్లి వెంకటస్వామి తెలిపారు.

సీపీఐ పోరుయాత్ర విజయవంతం చేయండి

కాసిపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుయాత్ర, ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేణ శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 30న, మే 2, 3తేదీల్లో కాసిపేట మండలంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

పంట నష్టంపై సర్వే

జన్నారం: మండలంలో పంట నష్టంపై సర్వే ప్రారంభించారు. ఈ క్రమంలో మండలంలోని పలు గ్రామాల్లో ఏఈవోలు పంట నష్టం అంచనా వేశారు. మరో రెండు రోజుల్లో వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏఈవో అక్రముల్లా తెలిపారు.

కోటపల్లి: మండలంలోని కొండంపేట, నాగంపేట, బొప్పారంలో దెబ్బతిన్న వరి పంటలను ఏవో మహేందర్ పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

మెరుగైన సేవలు అందించాలి

బెల్లంపల్లిరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు మెరుగైన సేవలు అందిస్తూ మన్ననలు పొందాలని ఎంపీపీ శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీవో ఉమాదేవి అన్నారు. బెల్లంపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఎంపీపీ, సీడీపీవో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లకు చేపట్టాల్సిన విధులు, గ్రామీణులకు అందించాల్సిన సేవల గురించి అవగాహన కల్పించారు. అనంతరం టీచర్లకు మెడికల్ కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సృజన, జ్యోతి, ప్రభావతి, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలపై పోరాటం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి. రమాదేవి ఆధ్వర్యంలో జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లతో జిల్లా కేంద్రంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యల గురించి చర్చించి, భవిష్యత్‌లో వాటిపై పోరాడేందుకు సంసిద్ధం అయ్యారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

వేమనపల్లి: ఒడ్డుగూడం అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఉపాధిహామీ ఏపీఓ సత్యప్రసాద్ పరిశీలించారు. మస్టర్లను వెరిఫికేషన్ చేసి కూలీలకు సూచనలు చేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

తాండూర్: మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తాండూర్ అదనపు ఎస్సై మధుసూదన్ తెలిపారు. మండల కేంద్రం ఐబీలో బుధవారం దుకాణ, వాహనదారులకు ట్రాఫిక్ నియమాలు, సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

కోటపల్లి: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో భాస్కర్ సిబ్బందికి సూచించారు. మండలంలోని రాపన్‌పల్లిలోని నర్సరీల్లో మొక్కలు పెంపకం, హరితహారంలో నాటిన మొక్కలను బుధవారం పరిశీలించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే దివాకర్‌రావు



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దండేపల్లి: రైతు సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. దండేపల్లి, చెల్కగూడ, రెబ్బనపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగయ్యతో కలిసి బుధవారం ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, గిట్టుబాటు ధర పొందాలన్నారు. ఎంపీపీ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, ఉపసర్పంచ్ భూమన్న,పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సత్యం, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని టీకానపల్లి, సబ్బెపల్లి, హాజీపూర్ గ్రామాల్లో బుధవారం డీసీఎంఎస్, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, రైతుబంధు సమితీ మండల కన్వీనర్ శ్రీనివాసరావు, సర్పంచ్ మల్లేశ్వరి, ఎంపీటీసీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి పనులు చేయడంలో ప్రభుత్వం విఫలం'



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలటౌన్: పాతమంచిర్యాలలోని 8, 9వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు రెండు నెలల క్రితం శంకుస్థాపన చేసి, పనులు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. అభివృద్ధి పనులు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ సందర్భంగా పాతమంచిర్యాలలోని రామాలయం నుంచి కమాన్ వరకు రోడ్డును తవ్వి వదిలేసిన ప్రాంతాలను పరిశీలిస్తూ, కమాన్ వద్ద వేసిన శిలాఫలకానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరేశ్, మహిళా జిల్లా అధ్యక్షురాలు రజిత, మాజీ కౌన్సిలర్ మల్లయ్య, భీమయ్య, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఎస్వో టు జీఎంగా రాజేశ్వర్‌రెడ్డి



మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా ఎస్వో టు జీఎంగా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం జీఎం ఆఫీస్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. రాజేశ్వర్‌రెడ్డి ఖైరిగూడలోని ఓసీలో ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా జీఎం ఆఫీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎస్ఓ టు జీఎంకు సన్మానం

శ్రీరాంపూర్: ఏరియా ఎస్ఓ టు జీఎం త్యాగరాజు ఈ నెలాఖరుతో రిటైర్డ్ అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీరాంపూర్ ఓసీపీ అధికారులు, ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఓసీపీపై బుధవారం జరిగిన కార్యక్రమానికి జీఎం సంజీవరెడ్డి హాజరై త్యాగరాజును శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందించారు. రిటైర్మెంట్ తరువాత శేష జీవితాన్ని సుఖసంతోషాలతో గడుపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఓసీపీ ప్రాజెక్టు అధికారి పురుషోత్తం రెడ్డి, మేనేజర్ శ్రీనివాస్, గుర్తింపు సంఘం నాయకులు డీ.అన్నయ్య, మంద మల్లారెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, ఫిట్ సెక్రెటరీ కందుల శంకరయ్య, అధికారి శ్యాంసుందర్, ఏరియా క్వాలిటీ ఇంచార్జి వెంకటేశ్వర్‌రెడ్డి, సంక్షేమ అధికారి శంకర్, ఏఐటీయూసీ నాయకులు ఎస్కె బాజీసైదాలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి...



సన్మానిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ ఓపెన్‌కాస్ట్ గనిలో ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఆర్‌జీ-2 ఏరియా ఓసీ-3కి బదిలీ అయిన మధుసూదన్‌ను బుధవారం గని అధికారులు, కార్మిక సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఓసీలో చక్కటి బొగ్గు ఉత్పత్తిని సాధించటంలో మధుసూదన్ చేసిన సేవలను కొనియాడారు. ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ఇక్కడికి వచ్చిన గోవిందరావు, మేనేజర్ రామరాజును సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి అక్బర్‌అలీ, ఇప్పకాయల లింగయ్య, అంజనేయులు, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి రాజ్‌కుమార్, శంకరయ్య, పోషం తదితరులు పాల్గొన్నారు.

వినతి అందజేత

కాసిపేట: ఆదివాసీ గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలు ఏర్పాటు చేసి, ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, పెద్దనపల్లి సర్పంచ్ వేముల కృష్ణ బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.